క్లుప్తంగా

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలిశెట్టి శ్రీనివాస్.. తన సొంత ఖర్చులతో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నామని, అన్నదాన వితరణకు దాతలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం



రక్తదానం చేస్తున్న కస్తాల రామకృష్ణ

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కనకమ్మకు గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం ఏ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో శనివారం డీఎస్‌ఆర్ ట్రస్ట్‌ను సంప్రదించారు. దీంతో ట్రస్ట్ చైర్మన్ బాబూరావు వెంటనే స్పందించి తన మిత్రుడు కస్తాల రామకృష్ణతో రక్తదానం చేయించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు



మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శివశంకర్

కోదాడరూరల్ : మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ కె.శివశంకర్ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన 35 మంది మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని అన్నారు. వాహనాలు ఇస్తే.. ఏదైన ప్రమాదం చోటుచేసుకుంటే మీరే బాధ్యులు అవుతారని తెలిపారు. మైనర్లు చదువుపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ అంజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

శ్రీలతకు ఇంపాక్ట్ నారీ సెల్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న వీరవెల్లి శ్రీలత

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని లక్డీకాపుల్‌లోని ఐసీఐ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నారీ సెల్ ఆధ్వర్యంలో రీజినల్ డైరెక్టర్లకు నాయకత్వ లక్షణాలపై నిర్వహించిన శిక్షణను పొందిన నేరేడుచర్లకు చెందిన నారీ సెల్ రీజినల్ డైరెక్టర్ వీరేపల్లి శ్రీలత శనివారం సర్టిఫికెట్ అందుకున్నారు. సర్టిఫికెట్‌ను నేషనల్ అడ్వైజర్ నళిని చేతుల మీదుగా అందుకున్నట్లు ఆమె తెలిపారు. మహిళల జీవిత అభ్యున్నతికి ఏ విధంగా సహాయపడవచ్చు, ఏ విధంగా అడ్డంకులు తొలగించుకుంటూ తమ జీవితంలో ముందుకు వెళ్లవచ్చనే అంశంపై శిక్షణ ఇచ్చినట్లు శ్రీలత తెలిపారు.

‘పీఎం ధన్ ధాన్య కృషి యోజన’ ప్రారంభం వీక్షణ



పథకం ప్రారంభాన్ని వీక్షిస్తున్న ఏఎంసీ పాలకవర్గం, అధికారులు, రైతులు

హుజూర్‌నగర్ : వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపర్చడం, రైతులకు సులభతర రుణాల కల్పన మొదలైన అంశాలతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమ ప్రత్యేక ప్రసారాన్ని హుజూర్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు వీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్, దేశముఖ్ రాధికఅరుణ్‌కుమార్, ఉన్నత శ్రేణి కార్యదర్శి సంతోష్ కుమార్, ద్వితీయ శ్రేణి కార్యదర్శి గని, సూపర్‌వైజర్ నవీన్, సుధాకర్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండ్

- 60 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ భవనం శిథిలం
- ఇరుపక్కలా ఆక్రమణ
- నిలువ నీడ లేక ప్రయాణికులకు తిప్పలు
- బస్సు సౌకర్యం కల్పించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు



నడిగూడెంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ భవనం

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్టాండ్ భవనం 60 ఏళ్ల క్రితం నిర్మించనది కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అందులో సౌకర్యాలు కల్పించకపోవడంతో గత 30 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. ఇదే అదునుగా భావించి ఇరుపక్కల దుకాణాల వారు బస్టాండ్ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. అయితే మండల కేంద్రం అయిన నడిగూడెంలో కనీసం బస్టాండ్ లేకపోవడంతో మండల కేంద్రానికి వచ్చిపోయే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిలువ నీడ లేక బస్టాండ్ సెంటర్‌లో ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద వాహనాల వేచి ఉంటున్నారు. మండల కేంద్రంలో బస్టాప్, మరుగుదొడ్ల వంటి సౌకర్యం కూడా లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నడిగూడెంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

30 ఏళ్ల కిందట నడిగూడెంకు ఖమ్మం, సూర్యాపేట, జగ్గయ్యపేట ఆర్టీసీ బస్సులతో పాటు 15 ఏళ్ల క్రితం వరకు కోదాడ నుంచి బస్సు వచ్చివెళ్లేవి. దీంతో బస్టాండ్.. బస్సులు, ప్రయాణికులతో కళకళలాడేది. మునగాల మండలం జగన్నాథపురం, నడిగూడెం మండలం వేణుగోపాలపురం గ్రామాల్లో నాడు పండించిన కూరగాయలను రైతులు ఆయా పట్టణాలకు తీసుకెళ్లేవారు. కానీ బస్సులు రాక బస్టాండ్ లేక నేడు ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి



“ గత 25 సంవత్సరాలుగా నడిగూడెం బస్టాండ్ నిరుపయోగంగా ఉంటోంది. ప్రస్తుతం బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరింది. బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంట దుకాణాల వద్ద ఆటోల కోసం ఎదురు చూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కావున బస్టాండ్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎండీ.జలీల్, నడిగూడెం

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ పెండెం ముత్యాలుగౌడ్

గరిడేపల్లి : ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని పీఏసీఎస్ చైర్మన్ పెండెం ముత్యాలుగౌడ్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని సర్వారం గ్రామంలో నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ గరిడేపల్లి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన సహకార బ్యాంకులో లాకర్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే డిపాజిట్స్, మార్టిగేజ్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవికుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కృష్ణకుమారి, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, సీఈఓ గోపయ్య, డైరెక్టర్లు యల్లయ్య, కోటేశ్వరరావు, చంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టాటా ఏస్ వాహనం పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని కోదాడ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం రావిరాలకు చెందిన యమపంగు నాగరాజు అన్నారం వద్ద గల పాలేరు వాగు నుంచి ఇసుకను టాటా ఏస్ వాహనంలో లోడ్ చేసుకొని కోదాడ వైపు వస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకొని ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం

మునగాల : బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోమని బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వల్లోజు వసంత్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో అగ్రవర్ణాలకు 7 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచిన సమయంలో ఏ బీసీ బిడ్డ అడ్డుకోలేదని, ప్రస్తుతం బీసీలకు 42శాతం రిజర్వేషన్ చేస్తే అడ్డుకోవడం సహించరాని కుట్ర అని అన్నారు. ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని లేనిపక్షంలో బీసీలు ఐక్యమై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని లేనిచో ఆ పార్టీలకు మనుగడ కష్టమని ఆయన అన్నారు.

ఆర్.కృష్ణయ్య బీసీ వాదం.. పదవుల కోసమే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పదవుల కోసమే బీసీ వాదాన్ని వాడుకుంటున్నాడని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కొందరు రాజకీయ నాయకులు కాలరాస్తున్నారన్నారు. సగభాగానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా అసెంబ్లీ, పార్లమెంటు, చట్టసభలలో కూడా ఇదే విధంగా రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతో బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి పార్లమెంటుకు పంపారని, మరి జాతీయ అధ్యక్షుడిని అని చెప్పుకునే కృష్ణయ్య ప్రధానమంత్రి మోదీతో మాట్లాడి ఎందుకు పార్లమెంటులో పాస్ అయ్యే విధంగా కృషిచేయలేదో బీసీ వర్గాలకు తెలపాలని కోరారు. బీసీల పేరు చెప్పుకొని పార్టీలు మారుతూ ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా పదవులు అనుభవిస్తున్నాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం, కొంపెల్లి వెంకటనారాయణ, మండవ వెంకటాద్రి, బచ్చలకూర మంగమ్మ పాల్గొన్నారు.

చంద్రునాయక్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



చంద్రు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంజీనాయక్, తదితరులు

మఠంపల్లి : మండలంలోని కిందితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్యా చంద్రునాయక్ అకాల మరణం పార్టీకి తీరని లోటని పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ అన్నారు. శనివారం చంద్రునాయక్ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దహన సంస్కారాల కోసం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా చంద్రునాయక్ కుటుంబానికి పోలీస్ ఉద్యోగి భూక్యా శ్రీకాంత్ కూడా రూ..5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్, నాయకులు బాణోతు తులసీరాంనాయక్, భూక్యా రవీందర్ నాయక్, మాళోతు శ్రీనునాయక్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలి



మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : బీసీల రిజర్వేషన్లపై బీసీలకు జరుగుతున్న అన్యాయంపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బీసీలు ఏకం కావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రామచంద్రాగూడెంలో గల బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన బీసీ యువజన సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు జక్కా నాగేశ్వర్‌రావు, సురేష్ యాదవ్, పట్టేటి రమేష్, సతీష్, రాజశేఖర్, వెంకట్, పురుషోత్తం, గంగాధర్ తదితరులున్నారు.


బీసీలను పట్టించుకోని ప్రభుత్వం

హుజూర్‌నగర్ : ప్రభుత్వం బీసీలను పట్టించుకోవడం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సోమయ్య ఆరోపించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన మార్బుల్ వర్కర్స్ యూనియన్ 2వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సుమారు 62 శాతం బీసీలు ఉన్నప్పటికీ వారిని పట్టించుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్, కోశాధికారిగా అంజయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు రాజు, పద్మ, లింగయ్య, ఎల్లయ్య, సతీష్, బాల సైదులు, వెంకన్న, నాగరాజు, ఖలీల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూర్ గ్రామంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెమ్మికల్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. గ్రూప్-1లో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఆవుల సతీష్, మెడిసిన్‌లో సీటు సాధించిన విద్యార్థినులు యాతాకుల శ్రీజ, యాతకుల అక్షర, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గిలకత్తుల యల్లాగౌడ్‌ను ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ సత్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మేడి కృష్ణ, యాదగిరి, వెంకట్ రెడ్డి, మల్లేశ్, మల్సూర్, కృష్ణారెడ్డి, ఆవుల వెంకన్న, గుణగంటి వెంకన్న, అశోక్ యాతకుల వెంకన్న, బొడ్డు శ్రీను, పర్వతాలు, ఎల్లయ్య, బైరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నజిమాబేగం

మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమాబేగం అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో పాటు ఆహార పదార్థాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు ఎల్లమ్మ, భారతి, వాణి, సైదమ్మ, హెల్పర్లు రమణ, ఎల్లమ్మ, రాధిక, కవిత, ఎఎన్‌ఎం మాధవి, ఆశా వర్కర్లు లక్ష్మి, గీత ఉన్నారు.

వివాహానికి రూ. 40 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన జె.వేణు, సుజాత కుమార్తె మౌళిక వివాహానికి వీర్లపాటి దయాకర్, శాంత (యూఎస్‌ఏ) పంపిన రూ.40 వేల ఆర్థికసాయాన్ని శనివారం స్థానిక వాసవి భవన్‌లో అధ్యక్షుడు వీర్లపాటి రమేష్, జిల్లా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు మాశెట్టి అనంత రాములు, మాజీ ఎంపీటీసీ గుండా రమేష్, మాజీ కౌన్సిలర్లు ఓరుగంటి నాగేశ్వరరావు, అట్లూరి హరిబాబులు వారికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి



కేజీబీవీలో ధ్యానంలో పాల్గొన్న విద్యార్థినులు

నడిగూడెం : విద్యార్థి దశ నుంచే ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని ధ్యాన నిపుణులు కొండా ఉపేందర్, మోత్కూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ధ్యానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుందన్నారు. ప్రతిరోజూ ధ్యానం చేయాలన్నారు. తద్వారా పాఠాలు కూడా సులభంగా అర్థమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షర్బత్ మతీన్ మృతికి సంతాపం



షర్బత్ బండి వద్ద మతీన్ (ఫైల్)

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో గల ఆలయం ఎదుట కోదాడ– మేళ్లచెరువు ప్రధాన రహదారిపై మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామానికి చెందిన మహ్మద్(షర్బత్) మతీన్ ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మతీన్ మృతి పట్ల గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. కాగా, మతీన్ గత కొన్నేళ్లుగా సోడా బండి పెట్టి నిమ్మకాయ షర్బత్ తయారు చేస్తూ షర్బత్ మతీన్‌గా ఫేమస్ అయ్యాడని పలువురు గ్రామస్తులు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

హుజూర్‌నగర్ : మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపాలిటీ కార్మికుల పట్టణ మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అనంతరం 11 మందితో మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఈ.శ్రీను, అధ్యక్షుడిగా ఎం.దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీను, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మికులు కుమారి, సైదులు, వీరబాబు, సైదులు, దేవకర్ణ, నరసింహారావు, సైదమ్మ, గోవిందమ్మ, కె.శ్రీను, రేణుక, వెంకటరమణ, చంద్రకళ, వీరబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీసీరెడ్డి విద్యానిలయం స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ సలీంషరీఫ్



నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

కోదాడ : పట్టణంలోని సీసీరెడ్డి విద్యానిలయం ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదాడ మండల ఎంఈఓ సలీంషరీఫ్ మాట్లాడారు. సీసీరెడ్డి విద్యానిలయం కోదాడ ప్రాంతంలో గడిచిన 50 ఏళ్లుగా నైతిక విలువలతో కూడిన విద్య అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బిషప్ ధమన్‌కుమార్, సుపీరియర్ జనరల్ వట్టే జపమాల, ప్రావిన్షియల్ సుపీరియర్ ఉడుముల శేరీ, కందుల కోటేశ్వరరావు, చింతా కవిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు



బస్సు కోసం రోడ్డు వెంట నిల్చొని ఉన్న ప్రయాణికులు

మేళ్లచెరువు : చింతలపాలెం మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చివెళ్తుంటారు. బస్ షెల్టర్ లేక వీరు మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రోడ్డు పక్కన దుకాణాల పక్కన బస్సులు, ఆటోల కోసం నిలబడాల్సి వస్తోంది. కనీసం కూర్చోడానికి కూడా సౌకర్యం లేదు. మరుగుదొడ్లు లేవు. దీంతో మహిళలు, గర్భిణులు, వృద్ధులకు తిప్పలు తప్పడం లేదు. బస్సులు ఎక్కేందుకు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆపుతుండడంతో ట్రాఫిక్‌జామ్ అవుతోంది. మండల కేంద్రం ఏర్పడి సుమారు పది సంవత్సరాలు అవుతున్నా కనీసం బస్‌షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రం హుజూర్‌నగర్‌కు వెళ్లాలన్నా, ఈ మండలంలోని ప్రజలు ఏపీ ప్రాంతానికి రాకపోకలు సాగించాలన్నా ప్రధానంగా చింతలపాలెం మండల కేంద్రానికి వచ్చి అక్కడి నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు. కావున ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లింగయ్య మృతి తీరనిలోటు

పెన్‌పహాడ్ : ప్రజా కళాకారుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ వల్దాస్ లింగయ్య మృతి సీపీఎంకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. లింగయ్య చిన్నతనం నుంచే ఎర్రజెండా చేతబట్టి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నెమ్మాది లక్ష్మి, మండల కమిటీ సభ్యులు రణపంగ బుచ్చిరాములు, మోదుగు రవీందర్‌రెడ్డి, లింగయ్య సైదులు, రాధాకృష్ణ, వెంకయ్య, సోమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అర్వపల్లి : నాగారం మండలం పస్తాలలోని పూలగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని సందర్శించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా సూర్యక్షేత్రాన్ని సందర్శించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.సునీత, ఉపాధ్యాయులు రాము, చక్రధర్, రాజశేఖర్, స్వామిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతను పెంపొందించాలి

పెన్‌పహాడ్ : బాలికల సాధికారతను పెంపొందించాలని ఎస్‌ఐ గోపికృష్ణ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జస్ట్ రైట్స్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. బాల్య వివాహాలు నేరమని, వాటిని నిర్మూలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ ఆసియా జబిన్, సోమయ్య, అలీముద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఆర్‌కు నివాళులు

అర్వపల్లి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు శనివారం తుంగతుర్తిలో నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఆర్ కుమారుడు సర్వోత్తంరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, మహరాజు, మాజీ దేవస్థాన చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, గుయ్యని బాబు, కొప్పోజు వెంకన్న, అనిల్, రవీందర్, కృష్ణమూర్తి, మల్లయ్య, భిక్షం, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధులొచ్చినా.. గోడ నిర్మాణంపై నిర్లక్ష్యం



డ్రెయినేజీలో కూలిన చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ

- ఏడాది క్రితం కురిసిన వర్షాలకు కూలిన పీహెచ్‌సీ ప్రహరీ
- నిధులు మంజూరై నాలుగు నెలలైనా పట్టించుకోని అధికారులు

చిలుకూరు : గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు చిలుకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ కూలింది. భారీ వర్షాలకు అంతర్గంగ వాగు ఉధృతంగా ప్రవహించి పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి భారీగా వరద చేరింది. దీంతో ఆరోగ్య కేంద్రానికి ముందు వైపు, పక్కన గల ప్రహరీ కూలాయి. ఆరోగ్య కేంద్రంలోని పలు ఫైళ్లు కూడా తడిసాయి. దీంతో జిల్లా వైద్యాధికారి కోటాచలం, అధికారులు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ప్రహరీ నిర్మాణానికి మండల పంచాయతీ రాజ్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వానికి పంపించారు. దీంతో నాలుగు నెలల క్రితం గోడ నిర్మాణానికి రూ.15 లక్షలు కూడా మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కానీ నేటివరకు ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. దీంతో రాత్రి సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రక్షణ కరువైంది. పాడి పశువులు ఆరోగ్య కేంద్రంలోకి వస్తుండడంతో మొక్కలు, చెట్లు ధ్వంసమవుతున్నాయి. అంతేకాకుండా ప్రహరీ కూలి పక్కనే ఉన్న డ్రెయినేజీలో పడడంతో మురుగు నీరు ప్రవహించక నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టిన అధికారులు పీహెచ్‌సీ ప్రహరీని ఎందుకు నిర్మించడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోడ నిర్మాణం చేపట్టి డ్రెయినేజీ శుభ్రం చేయాలని కోరుతున్నారు.